ఘనంగా హనుమాన్ జయంతి





కర్మన్‌ఘాట్‌లోని శ్రీ ధ్యానాంజనేయస్వామి దేవాలయంలో పూజలందుకుంటున్న స్వామివారు, దర్శనానికి బారులుతీరిన భక్తులు



మన్సూరాబాద్ చౌరస్తాలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు
- ప్రత్యేక పూజలు చేసిన భక్తులు

చంపాపేట/ వనస్థలిపురం: వైశాఖ దశమి హనుమజ్జయంతిని పురస్కరించుకుని శనివారం ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా దేవాలయాల్లో ఉదయం నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కర్మన్‌ఘాట్‌లోని శ్రీ ధ్యానాంజనేయస్వామి దేవాలయంలో వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నిర్వాహకులు దర్శనం, ప్రసాదం కౌంటర్ల వద్ద ప్రత్యేక క్యూలైన్లు, షెడ్డులు, మంచినీటి సౌకర్యం, ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసశర్మ, ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ధర్మకర్తలు మేక సురేందర్‌రెడ్డి, నారగోని శ్రీనివాస్‌యాదవ్, చాతిరి మధుసూదన్ సాగర్, గూడూరు మధుసూదన్‌రెడ్డి, చీర తిరుమలేష్, చేగోని సురేష్‌గౌడ్, గోగిరెడ్డి అంజిరెడ్డి, బిల్లకంటి కిరణ్‌కుమార్, బీసుకుంట్ల సతీష్‌గౌడ్, ముద్ద కళ్యాణ్‌చక్రవర్తి, బబ్బూరి ఆనంద్ కుమార్‌గౌడ్, సంబరాజు శైలజ తదితరులు పాల్గొన్నారు.

శారదానగర్ శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో...

హనుమాన్ జయంతిని పురస్కరించుకుని వనస్థలిపురం శారదానగర్‌లోని శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సామ వెంకట్‌రెడ్డి, డా.ఎస్.అప్పారావు, ఆలయ అడ్‌హక్ కమిటీ ప్రతినిధులు సుబ్బారావు, సుధాకర్‌రెడ్డి, విజయ్‌కిరణ్‌శర్మ, శ్రీనివాసులు, శ్రీశైలంగుప్త తదితరులు పాల్గొన్నారు.

మన్సూరాబాద్‌లో...

మన్సూరాబాద్: హనుమాన్ జయంతి వేడుకలను మన్సూరాబాద్‌లో పలు దేవాలయాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాల్లో అన్నదానం వితరణ చేశారు. మన్సూరాబాద్ చౌరస్తా సమీపంలోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- సహారాస్టేట్స్‌కాలనీలోని లలితానాగ లింగేశ్వరస్వామి దేవాలయంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు.
- సెంట్రల్‌బ్యాంక్‌కాలనీలోని ఉమానాగ లింగేశ్వరస్వామి దేవాయలయంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు. అదే విధంగా ఆదిత్యానగర్‌కాలనీలోని పంచముఖ ఆంజనేయస్వామికి ఆకుపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మలక్‌పేటలో...

మలక్‌పేట: మూసారాంబాగ్ డివిజన్ పరిధిలో ఆంజనేయస్వామి దేవాలయాలలో శనివారం హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దిల్‌సుఖ్‌నగర్ మారుతి మందిర్, సలీంనగర్ షిర్డీ సాయిబాబామందిర్, శాలివాహననగర్ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాల్లో గణపతి పూజ, స్వామివారికి పంచామృతంతో అభిషేకం చేసిన అనంతరం స్వామివారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆధ్యాత్మికతను అలవర్చుకోవడం వలన మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు.



ఆదిత్యానగర్‌కాలనీలోని పంచముఖ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



సలీంనగర్‌లో పూజలు చేస్తున్న చైర్మన్ రమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, భక్తులు



దిల్‌సుఖ్‌నగర్ మారుతి మందిర్‌లో పూజల్లో పాల్గొన్న భక్తులు

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా అహ్మద్ నియామకం



అహ్మద్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న చల్లా నర్సింహారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా ఆర్‌కేపురం డివిజన్ ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన మమ్మద్ అహ్మద్‌ను నియమిస్తూ డీసీసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి శనివారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అహ్మద్ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. నియామకానికి సహకరించిన పీసీసీ అధ్యక్షుడు సీఎం రేవంత్‌రెడ్డికి జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

క్యాండిల్ ర్యాలీకి తరలివెళ్లిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నాయకులు



క్యాడిల్ ర్యాలీకి తరలుతున్న ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు

ఎల్‌బీనగర్: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గన్‌పార్కు అమరవీరుల స్థూపం నుంచి ట్యాంక్‌బండ్ అమరజ్యోతి వరకు చేపట్టిన క్యాండిల్ ర్యాలీలో పాల్గొనేందుకు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు భారీ ఎత్తున ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి తరలివెళ్లారు.

సత్కారం



నాగమోహన్‌ను సన్మానిస్తున్న తోటి ఉద్యోగులు

మన్సూరాబాద్: జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ)లో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన స్టోర్స్ మేనేజర్ ఆర్. నాగమోహన్‌ను జీఎస్ఐ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (డీడీజీ) లలన్‌ప్రసాద్ సింగ్ శుక్రవారం రాత్రి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీడీజీ లలన్‌ప్రసాద్ సింగ్ మాట్లాడుతూ జీఎస్ఐ అభివృద్ధికి స్టోర్స్ మేనేజర్‌గా నాగమోహన్ చేసిన సేవలను కొనియాడారు. లోయర్ డివిజన్ క్లర్క్‌గా ఉద్యోగంలో చేరి అంచెలంచెలుగా ఎదిగి జీఎస్ఐ ఎదుగుదలకు కృషి చేశాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీడీజీలు అన్షుమాన్ ఆచార్య, ఎస్ఎన్ మహాపాత్ర, అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ మధిర సత్యనారాయణ, ఉద్యోగులు రత్నమాల, పావనీ, కళ్యాణి, ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు కిలోకు రూపాయల చొప్పున ఈ విధంగా ఉన్నాయి. టమాటా లోకల్ 23, వంకాయ 23, బెండ 40, పచ్చిమిర్చి 50, కాకర 38, బీర 35, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 16, క్యారెట్ 40. దొండ 18, ఆలు 28, ఉల్లి 28, గోకర 45, దోస 19, సొర 11, పొట్ల 15, అరటి 09, చిక్కుడు 75, ఆర్వి 40, మునగ 40, చిలగడదుంప 65, బీట్‌రూట్ 19, కీర 18, ఫ్రెంచ్ బీన్స్ 95, కాప్సికమ్ 45. ఈ ధరలు ఆదివారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

వాహనదొంగల అరెస్టు

19 వాహనాలు స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితులు

లక్డీకాపుల్: ద్విచక్ర వాహనాలను చోరీలు చేసే నిందితులను అరెస్టు చేయడంతోపాటు వారి వద్ద నుంచి 19 వాహనాలను సైఫాబాద్ క్రైమ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్బర్ మీర్జా, అబ్దుల్‌సలీమ్ ఖాన్, హైదర్ మూస్వి, మంచికంటి రాజులు రాచకొండ కమిషనరేట్ పరిధిలో పలు నేరాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. నిందితులు బహిరంగ ప్రదేశాల్లోకి వెళ్లి వాహనదారుల కదలికలను గమనిస్తూ వాహన యజమానులు వాహనాలను పార్క్ చేసిన అనంతరం అక్కడి నుంచి వెళ్లగానే మాస్టర్ కీతో చోరీకి పాల్పడుతుంటారని తెలిపారు. గతంలో హైదరాబాద్ కమిషనరేట్‌లోని నాంపల్లి, నారాయణగూడ, బాగంబజార్ పోలీస్ స్టేషన్ల పరిధితోపాటు కర్నూల్ జిల్లా ఓవర్కల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా దొంగతనాలు చేయడంతో అరెస్టు అయినట్లు తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్ సిటీ పోలీసులు మహ్మద్ అబ్దుల్ సలీమ్‌పై పీడీ యాక్ట్ నమోదు చేశారని వివరించారు.

యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తే కార్యాలయాన్ని ముట్టడిస్తాం

మూడో రోజుకు చేరిన క్రీడా కార్మికుల ధర్నా



హయత్‌నగర్‌లోని క్రీడా కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

మన్సూరాబాద్: మెట్ట వ్యవసాయ పరిశోధన కేంద్రం (క్రీడా)లో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ కార్మికులు చేస్తున్న ధర్నా మూడో రోజుకు చేరింది. ఈ ధర్నా కార్యక్రమానికి సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసర నర్సిరెడ్డి హాజరై మాట్లాడుతూ గత మూడు రోజులు హయత్‌నగర్‌లోని క్రీడా కార్యాలయం ఎదుట ఉదయం 7.30 గంటల నుంచి 8 గంటల వరకు సాయంత్రం 5గంటల నుంచి 5.30 గంటల వరకు ధర్నా చేస్తున్నామన్నారు. కార్మికుల వేతనాలు పెంచాలని మార్చి నెలలోనే క్రీడా డైరెక్టర్‌కు, హయత్‌నగర్‌లోని ఉన్నతాధికారికి వినతిపత్రాలు ఇవ్వడం జరిగిందని వివరించారు. క్రీడాలో పనిచేస్తున్న కార్మికుల పట్ల యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తుందని, అతి తక్కువ వేతనాలతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని తెలిపారు. ఇదే విధంగా మొండిగా వ్యవహరిస్తే సీఐటీయూ ఆధ్వర్యంలో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దర్శన్, అశోక్, శ్రీశైలం, సత్తయ్య, నాగమణి, అరుణకుమారీ, అనిత, మమత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజు రియింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

మంత్రి పొన్నంకు వినతిపత్రం అందజేత



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజేశ్వర్‌యాదవ్

చంచల్‌గూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లోని ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు, న్యాయవాది ఏ. రాజేశ్వర్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఆయన శనివారం సెక్రటేరియట్‌లో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌యాదవ్ మాట్లాడుతూ ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నందుకు ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నాయన్నారు. బీసీ స్టడీ సర్కిల్ బడ్జెట్‌ను రూ. 15 వేల కోట్లకు పెంచాలన్నారు. విదేశాలకు వెళ్లి విద్యార్థుల జీఆర్‌ఈ, ఐల్స్ కోర్సులు ఉచితంగా కోచింగ్ ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా పెరిగిన ధరలకు అనుగుణంగా ఇంటర్, డిగ్రీ స్కాలర్‌షిప్‌లను రూ. 5వేల నుంచి రూ. 25 వేలకు పెంచాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు విజయ్‌కుమార్, సాయివర్ధన్, రవిచారి, జగదీశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వీధివ్యాపారుల సంరక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

సీఎంకు న్యాయవాది రాపోలు భాస్కర్ వినతి



సమావేశంలో మాట్లాడుతున్న రాపోలు భాస్కర్

సైదాబాద్: వీధివ్యాపారుల సంరక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ప్రముఖ హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ కోరారు. ఈ మేరకు శనివారం ఆయన సీఎంకు మెయిల్ ద్వారా తన వినతి పత్రాన్ని పంపించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాదాపు ఐదు లక్షల మంది వీధివ్యాపారుల సంరక్షణ కోసం 2014లో కేంద్ర ప్రభుత్వం రక్షణ చట్టాన్ని అమల్లోకి తెచ్చినా వాస్తవ పరిస్థితుల్లో అవి సరిగా అమలు కావడం లేదన్నారు. ఇప్పటికీ పలు జిల్లా, పట్టణ కేంద్రాల్లో వీధివ్యాపారులు పోలీసులు, మునిసిపల్ సిబ్బందిల అకాల దాడులు, జరిమానాలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సంరక్షణ చట్టం ప్రకారం ఆయా మునిసిపల్ అధికారులు వీధి వ్యాపారుల సర్వే చేపట్టి, వారికి లైసెన్సులు మంజూరు చేయాలన్నారు. జిల్లా కలెక్టర్‌లు వీధివ్యాపారుల సంరక్షణ కోసం కమిటీలు వేయాలని, వారి భద్రత కోసం చర్యలు తీసుకోవాలని అన్నారు. వీధి వ్యాపారుల కోసం ఏర్పాటు చేసిన సంరక్షణ చట్టం గురించి వారికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత కూడా అధికారులపైనే ఉంటుందన్నారు. తెలంగాణలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వారి సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలని న్యాయవాది రాపోలు భాస్కర్ కోరారు.

తొలగింపు సరే... తరలింపేది?

చెట్లకొమ్మల తరలింపులో అధికారుల అలసత్వం



శాలివాహననగర్‌లో ఫుట్‌పాత్‌పై పేరుకుపోయిన చెట్లకొమ్మలు

మలక్‌పేట: కాలనీలలో ఎక్కడ చూసినా ఫుట్‌పాత్‌లపై నరికేసిన చెట్ల కొమ్మలు కనిపిస్తున్నాయి. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో విద్యుత్‌శాఖ అధికారులు కరెంట్ తీగలకు చెట్లకొమ్మలు తాగకుండా తొలగింపు చర్యలు చేపడుతున్నారు. అయితే నరికేసిన తరువాత చెట్ల కొమ్మలను అక్కడ నుంచి తరలించడం మాత్రం మర్చిపోతున్నారు. మూసారాంబాగ్, అక్బర్‌బాగ్ డివిజన్ల పరిధిలోని కాలనీలలో నరికేసిన చెట్ల కొమ్మలు ఎండిపోయి చెత్త కుప్పలను తలపించేలా మారాయి. ఫుట్‌పాత్‌లపై పేరుపోయిన చెట్ల కొమ్మలతో పురుగులు, దోమలు పెరిగిపోతున్నాయని అధికారుల తీరుపట్ల స్థానికులు మండిపడుతున్నారు. చెట్లకొమ్మలు నరికేసిన విద్యుత్‌శాఖ వారే వాటిని తొలగించాల్సిన బాధ్యత ఉంటుందని జీహెచ్ఎంసీ అధికారులు పేర్కొంటున్నారు. చెట్ల కొమ్మలు నరికేసి రోజులు గడుస్తున్నా వాటిని పట్టించుకునే వారు కరువయ్యారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై అస్మాన్‌ఘడ్ విద్యుత్ శాఖ డీఈని వివరణ కోరగా తొలగించడంలో కొంత జాప్యం జరిగిందని, వాటిని వెంటనే తొలగించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

లింగోజిగూడ: నాగోలు డివిజన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని శనివారం ఉప్పల్ ఎంఈఓ కార్యాలయంలో తెలంగాణ ప్రైవేట్ విద్యాసంస్థల పేరెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు శ్యాం సుందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు పుస్తకాలు, దుస్తులు ఇతర వస్తువులు తమ వద్దనే కొనాలని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పలు ప్రైవేట్ పాఠశాలలు రోడ్లపైనే జాతీయ జెండాలను ఎగరవేస్తున్నారని దీని కారణంగా ప్రమాదాలు జరుతున్నాయని తెలిపారు. వెంటనే వాటిపై చర్యలు తీసుకోవాలని లేకపోతే పాఠశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

నేడు తల్లిదండ్రులకు ఓరియెంటేషన్ తరగతులు

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ శ్రీ సరస్వతీ ఉన్నత పాఠశాలలో ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రుల ఓరియెంటేషన్ తరగతులు నిర్వహిస్తున్నట్లు శనివారం పాఠశాల కరస్పాండెంట్ లలితారెడ్డి ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. విద్యార్థులలో చదువుపై ఏకాగ్రతను పెంచటం, సెల్‌ఫోన్ నిరంతరం వాడటం వల్ల అనర్థాలు, చెడు వ్యసనాలను తల్లిదండ్రులు ఏవిధంగా గుర్తించి అడ్డుకట్ట వేయాలో మానసిక వికాస నిపుణులచే ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్లు ఆమె స్పష్టం చేశారు. పాఠశాల ఆవరణలో ఉదయం గంటలకు 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు తరగతలు ఉంటాయని పరిసర కాలనీవాసులు పాల్గొనాల్సిందిగా ఆమె కోరారు.

నాగోలులో చైన్ స్నాచింగ్



సీసీ కెమెరాలో రికార్డు అయిన చైన్ స్నాచింగ్ నిందితులు

లింగోజిగూడ: ఇంటి ముందు ని లబడిన వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును ఎత్తుకెళ్లిన సంఘటన నాగోలు పోలీస్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... నాగోలు పోలీస్టేషన్ పరిధిలోని మర్రిపల్లి గ్రామంలో గడ్డం కౌసల్య శనివారం ఉదయం తమ ఇంటి ముందు ఉండగా గుర్తుతెలియని ఇద్దరు యు వకులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలోని 5తులాల బంగారు గొలుసును చోరీచేశారు. దీంతో బాధితురాలు నాగోలు పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. ఇప్పటికే నిందితుల కదలికలను సీసీ కెమెరాలలో గమనించి పోలీసులు వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

సైదాబాద్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

సైదాబాద్: గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. సైదాబాద్ ఎస్ఐ నాగోజు శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం సాయంత్రం ధోబీఘాట్ రహదారి పక్కన 40 నుంచి 50 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి పడిపోయి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసుల సమాచారంతో వచ్చిన 108 సిబ్బంది అతను చనిపోయినట్లు తెలిపారు. అతని వద్ద ఎలాంటి ఆచూకీ లభించలేదు. సైదాబాద్ పోలీసులు అతని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

నేడు మాక్సివిజన్ చౌరస్తాలో అవతరణ వేడుకలు



బోనగిరి చంద్రశేఖర్

మలక్‌పేట: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఆదివారం మూసారాంబాగ్ మాక్సివిజన్ చౌరస్తాలో నిర్వహిస్తున్నట్లు టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర కన్వీనర్ బోనగిరి చంద్రశేఖర్ తెలిపారు. రాష్ట్రం సిద్ధించి పది సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి పి లుపు మేరకు రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా జా తీయ జెండా ఆవిష్కరణ, విద్యార్థి అమరవీరులకు నివాళులర్పిస్తామని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులు, జర్నలిస్టులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు సన్మానం ఉంటుందని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సాయం చేస్తే ఎనలేని ఆనందం

సామాజిక కార్యకర్త దోసపాటి రాము



పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్న దోసపాటి రాము

మన్సూరాబాద్: మనిషికి మనిషి సాయం చేయటంలోనే ఆనందం ఉంటుందని సామాజిక కార్యకర్త, రైస్ ఏటీఎం నిర్వాహకుడు దోసపాటి రాము అన్నారు. నాగోలు డివిజన్ పరిధి రాక్‌హిల్స్‌కాలనీలోని రైస్ ఏటీఎం వద్ద శనివారం ఆయన పేదలకు బియ్యం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ఆపదలో, ఆకలితో ఉన్న వ్యక్తులకు సాయం చేస్తే పొందే ఆనందం వర్ణించలేనిదన్నారు. గత కొన్నేళ్లుగా రైస్ ఏటీఎం వద్ద పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు రాఘవేందర్, సూర్యారెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



దోమల నివారణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

లింగోజిగూడ: రాబోయే వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ తెలిపారు. డివిజన్ పరిధిలోని మూసీ పరివాహక కాలనీలలో శనివారం ఎంటామాలజీ ఏఈ రాంబాబు , సిబ్బందితో కలసి కార్పొరేటర్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దోమల కారణంగా ప్రజలు రోగాల బారీన పడుతున్నారని వాటి నివారణకు చర్యలు ఇప్పటి నుంచే చేపట్టామని అన్నారు.

డ్రైనేజీతోనే అసలు సమస్య

డివిజన్ పరిధిలోని గోకుల్ నగర్‌కాలనీలో నిత్యం డ్రైనేజీ పొంగి రోడ్లపై పారుతుందని దీంతో రోడ్లపై నడవలేని పరిస్థితి ఏర్పడిందని చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు స్థానిక కార్పొరేటర్ పవన్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. శనివారం కార్పొరేటర్, జలమండలి అధికారులతో కలసి కాలనీలో పర్యటించి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ సంవత్సరాల క్రితం వేసిన డ్రైనేజీ వ్యవస్థ కావడంతో సమస్య ఏర్పడుతుందని, ఉన్నత అధికారులతో సంప్రదించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు లావణ్య, విజయ లక్ష్మీ, చందుయాదవ్, సుందర్ నారాయణ, ఉపేందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సహారా కాలనీలో ఎన్నికలు

- జోరుగా ఇరు ప్యానళ్ల ప్రచారాలు
- 21 కమిటీ పోస్టులకు 42 మంది పోటీ
- ఓటర్లను ఆకట్టుకునేందుకు విందులు, తాయిలాలు



మన్సూరాబాద్ డివిజన్ పరిధి సహారా స్టేట్స్ కాలనీ ప్రధాన ద్వారం (చిత్రం)

మన్సూరాబాద్: గ్రామ పంచాయతీ ఎన్నికల స్థాయిలో ఉత్కంఠభరితంగా, ప్రతిష్టాత్మకంగా సహారా స్టేట్స్ మెయింటనెన్స్ వెల్ఫేర్ సొసైటీ ఎన్నికలు జరుగుతున్నాయి. గత 10 రోజులుగా ఇరు వర్గాల ప్యానెళ్ల అభ్యర్థులు కాలనీలోని ఇంటింటికీ తిరిగి ఓట్లను అభ్యర్థించారు. 21 మంది కమిటీ పోస్టులకుగాను 42 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. కాలనీలో 1170 ఇళ్లు ఉండగా (ప్రతి ఇంటికి ఒక ఓటరు) ఉన్నారు. అయితే వివిధ కారణాల రీత్యా 1002 మంది ఓటేసేందుకు అర్హత సాధించారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కాలనీలోని క్లబ్ హౌజ్‌లో పోలింగ్ నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి నరేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డిలు తెలిపారు. పోలింగ్ అనంతరం మధ్యాహ్నం 3 గంటల నుంచి కౌంటింగ్ చేపడుతున్నట్లు వారు వివరించారు.

పోటాపోటీగా ప్రచారాలు

వెంకటాద్రి ప్యానెల్ నుంచి అధ్యక్ష అభ్యర్థిగా సయ్యద్ జానీ పోటీపడుతుండగా, శ్రీకాంత్ ప్యానెల్ నుంచి కరణం శ్రీకాంత్ పోటీ చేస్తున్నారు. ఇరు ప్యానళ్ల అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కాలనీలోని ప్రధాన కూడళ్ల వద్ద తమ అభ్యర్థులతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం వేళలలో ర్యాలీగా ప్రచారాలు చేశారు.

జోరుగా విందులు

ఇరు ప్యానెళ్ల అభ్యర్థులు ఓటర్లను ఆకర్షించేందుకు జోరుగా విందులు ఏర్పాటు చేసి తాయిలాలు అందిస్తున్నారు. ఇరు ప్యానెళ్ల అభ్యర్థులు ఎన్నికలను ప్రతిష్టాత్మంగా తీసుకోవడంతో విందు రాజకీయాలు జోరుగా సాగుతున్నాయి.



ఇంటింటి ప్రచారంలో కరణం శ్రీకాంత్ ప్యానల్



ఇంటింటి ప్రచారంలో వెంకటాద్రి ప్యానల్